# బిసి ఉద్యమ కెరటం యద్దనపూడి హరిప్రసాద్

ప్రకాశం జిల్లా పర్చూరు ఉద్యమ ప్రాంతం. శ్రీకాకుళ గిరిజన తిరుగుబాటును అందుకొన్న చాగంటి భాస్కరరావు జన్మించిన ప్రాంతం. సైమన్ కమీషన్ గో బ్యాక్ అంటూ స్వాతంత్ర్య సమర జ్వాలలు భారత దేశానికి అందించిన టంగుటూరు ప్రకాశం పంతులు నడిచిన ప్రాంతం. దళిత, బహుజనులను ప్రజాస్వామ్యం కోసం మేల్కొల్పిన కారంచేడు సంఘటన జరిగిన రుధిరక్షేత్రం. మధురకవి, రాజా - లక్ష్మీ అవార్డు గ్రహీత పండిత బృందావనం రంగాచార్యులు తెలుగు భాషా సాహిత్య పరిమళాలను విద్యార్థులకు అందించిన ప్రాంతం. ఈ ప్రాంత నీరు, నేల, గాలి అంతా ఉద్యమమయం. ఈ గడ్డలో జన్మించిన నేటి యువ ఉద్యమ ప్రజా నాయకులలో ప్రజలు మెచ్చిన బిసి నాయకుడు యద్దనపూడి హరిప్రసాద్. 1996 నుండి ప్రజలు చాలా దగ్గరగా గమనిస్తున్న నాయకులలో హరిప్రసాద్ ప్రజలలో మమేకం అవుతున్న విధానం నేటి యువతకు ఎంతో ఆదర్శం. తల్లి, తండ్రి నుండి నేర్చుకొన్న సంప్రదాయ ఆదర్శభావాలు ఒక వైపు బీ ముఖ్యంగా పర్చూరు ప్రాంతంలో తన చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావంతో తనను తాను అర్థం చేసుకొంటూ మహాత్మా జ్యోతీరావు పూలే, డా. బి. ఆర్. అంబేద్కర్ ఆలోచనా దృక్పథం వైపు అడుగులు వేసిన పోరాట అధ్యయన శీలి. చదువు, సమీకరించు, పోరాడు సిద్ధాంతాలను నమ్మి ఆచరించాడు. డిగ్రీ తరువాత అడ్వకేట్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఈ క్రమంలో పర్చూరు కేంద్రంగా జరిగిన అనేక ఉద్యమాలు, వాటి ఫలితాలను నిశితంగా పరిశీలించారు. చీరాల కోర్టులో తన వాదనా పటిమతో రాణించాడు. తన మిత్రులు, సన్నిహితులతో చర్చించి న్యాయం అందరికీ సమానంగా అందాలంటే రాజకీయ మార్గం ఉత్తమమని నిర్ధేశించుకొన్నాడు. కేవలం రాజ్యాధికారం ద్వారానే ప్రజలకు సరైన న్యాయం అందివ్వగలమన్న స్థిర నిర్ణయానికి వచ్చాడు. బిసి సంక్షేమ సంఘం పర్చూరు నియోజక వర్గ అధ్యక్షునిగా ప్రకాశం జిల్లా కేంద్రంగా పనిచేశాడు. బిసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ, మహిళా సమస్యలపై అనేక పోరాటాలు చేసాడు. క్రమంగా నాడు పరుచూరు సర్పంచ్ గా ప్రజల మద్దతుతో, ప్రత్యక్ష ఎన్నికలలో గెలుపొందిన తన తల్లి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొన్నాడు. తల్లికి చేదోడు వాదోడుగా నిలుస్తూ పర్చూరు గ్రామ పంచాయతీలో ప్రతి ఇంటి సభ్యుడయ్యాడు. ఈ ప్రయాణంలో నియోజకవర్గంలో తన అనుచరగణాన్ని, నమ్మకస్తులను పెంచుకున్నాడు. అడుసుమల్లి గ్రామానికి చెందిన రావి రామనాథం బాబు కు అత్యంత నమ్మకస్తుడిగా ఎదిగాడు. బిసి సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను పర్చూరు నియోజకవర్గం లోని ప్రతి గ్రామానికి, ఇంటికి తీసుకువెళ్లడంలో తన వంతు పాత్రను సమర్ధవంతంగా నిర్వహించాడు. బిసి లకు నమ్మకస్తుడుగా, నిజమైన కార్యకర్తగా, నాయకుడుగా అభిమానులను సంపాదించుకున్నాడు. ఈ క్రమంలో తన అనుచరులు, పూర్వ మిత్రులు, ఆలోచనాపరులు క్రమక్రమంగా హరిప్రసాద్ కు దగ్గరయ్యారు. నిత్యం అనేక విషయాలు చర్చించటం అలవాటుగా మార్చుకున్నాడు. ‘ ఎదుగుతూ ఒదిగి ఉండాలనే ‘ తన తల్లి మాటకు కట్టుబడుతూ ప్రతి క్షణం ఏదో ఒక ప్రజా సమస్యపై స్పందిస్తూ వస్తున్నాడు. డా. బి. ఆర్. అంబెడ్కర్ కలలుగన్న సమ సమాజంలో కుల, మత, వర్ణ, వర్గ వైషమ్యాలను ఎండగట్టాడు. హరిప్రసాద్ చిన్నప్పటి నుండి తన చుట్టూ జరుగుతున్న పలు సమస్యలపై స్పందించే విధానం, సమస్యను జాగ్రత్తగా అధ్యయనం చేసే తీరు అందరినీ ఆకట్టుకొంటుంది. తన చుట్టూ వున్న ప్రతి ఒక్కరూ ఆనందంగా, ప్రాంతాలు సస్యశ్యామలంగా ఉండాలనే ఆలోచనకలిగిన పౌరుడు హరి ప్రసాద్. నిత్యం స్థానిక బిసిలకు కార్యకర్తలకు, నాయకులకు దగ్గరగా, ప్రతి కార్యకర్తకు అందుబాటులో వుంటున్నారు. “ ఎల్లప్పుడూ నవ్వుతూ, చలాకీగా, ఉత్సాహంగా ఉంటూ ఎవరితో విబేధాలు లేకుండా ఉండటం “ హరి ప్రసాద్ గొప్పతనమని పర్చూరు ప్రాంతంలోని ఆయన అభిమానులు చెప్పటం ఆనందదాయకం.

ఇటీవల మన రాష్ట్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో యద్దనపూడి హరిప్రసాద్ ప్రదర్శించిన “ స్థానిక ఎన్నికల హ్యూహం “ అందరికీ ఆదర్శం. పర్చూరు నియోజక వర్గంలో బిసిల అనుకూలతను కాపాడుతున్న హరిప్రసాద్ కృషికి పర్చూరు ప్రాంత ప్రజలు, మిత్రులు, అభిమానులు, సానుభూతిపరులు, బిసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ, మహిళలు ఆనందంతో వున్నారు. బహుజన న్తయకత్వం వైపు అడుగులు వేయమంటున్నారు.



**డా. మోదుగుల సుబ్బారావు**
**తెలుగు, సంస్కృత భాషోపాధ్యాయుడు**
**ఫోన్ : 94928 41257.**

# ఇదో ‘అనుభూతి’ బాణం!

మంత్రివర్గాల్లో మార్పులు, చేర్పులు సాధారణం. మొన్నటి కేంద్ర మంత్రివర్గ మార్పుచేర్పులు మాత్రం అసాధారణం. గడిచిన డెబ్బయ్యేళ్ల చరిత్రలో ఇంతటి భారీస్థాయి పునర్వ్యవస్థీకరణ దేశంలో ఎప్పుడూ జరగలేదు. పన్నెండుమందిని తొలగించి 36 మందిని కొత్తగా తీసుకున్నారు. కేంద్ర మంత్రిమండలి సభ్యుల సంఖ్య ప్రధానితో కలిపి 78కి చేరింది. యూపీఏ-2ను జంబో కేబినెట్‌గా బీజేపీ వాళ్లు ఆనాడు వెక్కిరించారు. ఇప్పుడు వారి మంత్రి మండలిలో అంతకంటే ఒక నెంబర్ పెరిగింది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు నరేంద్ర మోదీ ‘పరిమిత ప్రభుత్వం-విస్తృత పరిపాలన’ తమ లక్ష్యమని చెప్పేవారు. అందుకు తగినట్టుగానే 2014లో తొలి కేబినెట్ కూర్పును తనతో సహా 46 మందితోనే సరిపెట్టారు. నిబంధనల ప్రకారం మంత్రిమండలి సంఖ్య 81 దాకా ఉండవచ్చు. కనుక ఇప్పటి ఈ జంబో కేబినెట్‌ను తప్పుపట్టవలసిన అవసరం ఏమీలేదు. కానీ ‘పరిమిత ప్రభుత్వం’ అనే సంకల్పం పరిధులు ఎందుకు విస్తరించవలసి వచ్చిందనేదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బీజేపీ లేదా దాని నాయకత్వంలోని కూటమి మరోసారి గెలిచి ఢిల్లీ గద్దెనెక్కితే ఆ పార్టీ సుదీర్ఘ పరిపాలనా ప్రస్థానానికి వీలు చిక్కుతుంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నామమాత్రావశిష్టంగా తయారైంది. మరో ఓటమిని నిభాయించుకోలేదు. పూర్తిగా శిథిలమైపోతుంది. ఆ శిథిలాల మీద మరో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక నిర్మాణానికి సమయం పడుతుంది. ఈలోపల గట్టిగా కుదురుకుంటే, ఏక బిగిన ఐదుసార్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ రికార్డును తిరగ రాయవచ్చన్న ఆశ బీజేపీ నాయకత్వాన్ని సలుపుతున్నది. ఇంకోసారి గెలిస్తే నెహ్రూ తర్వాత హ్యాట్రిక్ విజయాలనందించిన నాయకుడిగా మోదీ మెడలో ఓ వీరతాడు పడుతుంది. ఇందిరమ్మ నాలుగుసార్లు ప్రధానిగా ప్రమాణం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మూడు విజయాలనందించారు. కానీ వరుసగా కాదు. ఈ నేపథ్యంలో బీజేపీ, వ్యక్తిగతంగా నరేంద్ర మోదీ ఒక అపురూప సన్నివేశపు అంచున నిలబడి ఉన్నారని భావించాలి. నరేంద్ర మోదీ హ్యాట్రిక్ కొడతారా? కాషాయ యుగపు పాంచజన్యం పూరిస్తారా? ఈ లక్ష్యసాధనకు గల అవకాశాలేమిటి? అడ్డంకులేమిటి? అనే విషయాలపై మేధోమథనం జరి గిన తర్వాతనే జంబో కేబినెట్ రంగప్రవేశం చేసిందనే అభిప్రాయం కలుగుతున్నది. రాజకీయంగా చూస్తే ఇప్పటికీ మోదీకి దీటైన నాయకుడు ప్రతిపక్ష శిబిరంలో కనిపించడం లేదు. రెండేళ్ల కిందటితో పోలిస్తే రేటింగ్ కొంత తగ్గినప్పటికీ మోదీయే అగ్రస్థానంలో కొనసాగుతున్నారని సర్వేలన్నీ చెబుతున్నాయి. ఆయనకు దరిదాపుల్లో కూడా మరో నాయకుడు లేడు. అయితే పరిపాలనాపరంగా ఆయన ప్రభుత్వానికి పడుతున్న మార్కులెన్ని?. ప్రజల ఆర్థిక - ఆయురారోగ్య పరిస్థితులెట్లా వున్నాయి? రక్షణ-విదేశాంగ విధానాలు దేశ ప్రతిష్ట ఇనుమడించేవిధంగా ఉన్నాయా? ఉద్యోగ ఉపాధి రంగాలు యువతరంగాలతో జతగూడుతున్నాయా? వ్యవసాయం, పరిశ్రమలూ లాభదాయకం గానే ఉన్నాయా? ... ఇత్యాది అంశాలపై అలుముకునే ప్రజాభిప్రాయమే మోదీ పాలనపై రేపటి తీర్పునకు కీలకం. ప్రజాభిప్రాయం ఎట్లా ఏర్పడుతుంది? ఒకటి ప్రత్యక్ష అనుభవం, రెండోది పరోక్షంగా కలిగే అనుభూతి. కరోనా పీక్ టైమ్‌లో ఇంటిల్లిపాదికీ సోకిందనుకోండి. ఒకరికో ఇద్దరికో సీరియస్ అయింది. ఆస్పత్రిలో బెడ్ ఆలస్యంగా దొరికింది. ఆక్సిజన్ సిలిండర్ దొరకలేదు. ఒకరు చనిపోయారు. మోదీ ప్రభుత్వం పనితీరుపై ఆ కుటుంబ సభ్యులు అనుభవపూర్వకంగా చెబుతారు. కరోనా సమయంలో వైద్య ఆరోగ్యశాఖ సరిగ్గా పనిచేయ లేదు. ఇటువంటి అలక్ష్యాన్ని మోదీ అస్సలు సహించరు. ఆరోగ్యమంత్రి హర్షవర్ధన్‌ను పీకిపారేశారు. ఇది అనుభూతి. అనుభవం వ్యక్తిగతం. ఇది కూడిక లెక్కలతో పెరుగుతుంది. అనుభూతి సామూహికం. ఇది హెచ్చవేతలతో పెరుగుతుంది. కనుక చాలా సందర్భాల్లో వ్యక్తిగత అనుభవాల కంటే సామూహిక అనుభూతి ది పైచేయి అవు తుంది. ‘హర్ దర్ద్‌కో ఏకీ దవా (సర్వరోగనివారిణి) జిందా తిలిస్మాత్’ అనే మాటను పూర్వకాలం నుంచీ వింటున్నాము. ఆ మందును ఎప్పుడూ వాడకపోయినా, ఆ నినాదాన్నయితే నమ్ముతాము. అదీ అనుభూతి. మోదీ సర్కార్ పాలనలో ప్రజల వ్యక్తిగత దైనందిన జీవితానుభవాలు ఎట్లా ఉన్నా... సామూహికంగా ఒక పాజిటివ్ అనుభూతిని ఉత్పత్తి చేయడం సంఘ్ పరివార్ మేథోవర్గం ముందున్న తక్షణ కర్తవ్యం. ఆ కార్యక్రమంలో తొలిదశ మొన్న జంబో కేబినెట్ ఏర్పాటుతో పూర్తవుతుంది. కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన వారిలో రవిశంకర్ ప్రసాద్, ప్రకాశ్ జవదేకర్, రమేశ్ పోఖ్రియాల్, డాక్టర్ హర్షవర్ధన్, సదానందగౌడ వంటి సీనియర్లు ఉండటం కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. కీలక శాఖల్లోని వైఫల్యాలకు కొందరు వ్యక్తులను బాధ్యులుగా చేయడం ద్వారా ప్రభుత్వ ఇమేజ్‌ను కాపాడుకునే ప్రయత్నంగా ఈ చర్య ఉన్నదనే అభిప్రాయం వినబడుతున్నది. ఈ పునర్వ్యవస్థీకరణ తర్వాత గతంలో వాజ్ పేయి ప్రభుత్వంలో పనిచేసిన వారిలో రాజ్‌నాథ్, నఖ్వీ ఇద్దరే మిగిలారు. ఇది వాజ్‌పేయి నీడ కూడా లేని అచ్చమైన మోదీ కేబినెట్. వైషల్యాలను కడిగేసుకోవడంతోపాటు సామాజిక మార్పు సంకేతాలను కూడా ఈ పునర్వ్యవస్థీకరణ బలంగా ఇచ్చింది. భారతీయ జనతా పార్టీ తొలిరోజుల్లో ‘జనసంఘ్’గా ఉన్నప్పుడు దానిపై బ్రాహ్మణ్-బనియా (వైశ్య) ముద్ర ఉండేది. ఎమర్జెన్సీ సమయంలో జనతా పార్టీలో విలీనం కావడం, అందులో చేరిన నానాజాతి సభ్యుల్లోని తటస్థ వర్గాలను తన గూటికి ఆకర్షించి బీజేపీ పేరుతో పునరుత్థానమవడం వెనుక వాజ్‌పేయి, అద్వాణీల వ్యూహరచనా చాతుర్యం కనిపిస్తుంది. ఈ వ్యూహం ఆరెస్సెస్ ఆలోచన కూడా కావచ్చు. అనంతర కాలంలో రామ మందిర ఉద్యమం ద్వారా ఉత్తరాదిలోని వెనుకబడిన వర్గాలనూ, గిరిజనులను పెద్దఎత్తున బీజేపీ సమీకరించుకోగలిగింది. పార్టీ సామాజిక పొందికను విస్తృతం చేసే పనిని మోదీ మరింత వేగవంతం చేశారు. ప్రధానితో సహా 78 మంది సభ్యులున్న మంత్రి మండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల సంఖ్య 52. బహుశా స్వతంత్ర భారత చరిత్రలో ఇంత ఎక్కువమంది బలహీనవర్గాల ప్రతినిధులున్న కేంద్ర మంత్రి వర్గం ఇదే కావచ్చు. ఈ సందేశాన్ని వ్యాప్తి చేయడం ద్వారా ఆయా వర్గాల పాజిటివ్ అనుభూతిని మోదీ ప్రభుత్వం ఆశిస్తున్నదని చెప్పవచ్చు. కేంద్ర మంత్రిమండళ్లలో సహాయ మంత్రుల పాత్ర నామమాత్రం. అధికారాన్ని చలాయించే కేబినెట్ మంత్రులు ఇప్పుడు ప్రధానితో కలిపి 31 మంది ఉన్నారు. వీరిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలన్నీ కలిపితే 11 మంది. ఇరవైమంది హిందూ అగ్రవర్ణాల వారు. వారిలో ఆరుగురు బ్రాహ్మణులు. ఐదుగురు రాజ్‌పుత్‌లు. ఇద్దరు బనియాలు, ఇద్దరు పాటీదార్లు (పటేల్), ఒకరు రెడ్డి. ఒకరు భూమిహార్, ఒకరు మల్హోత్రా. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కూడా కేబినెట్ కూర్పును ఖరారు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లకు పెద్దపీట వేశారు. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీకి ప్రతిష్టాత్మకం. ఎక్కువ లోక్‌సభ సీట్లున్న యూపీ నుంచి ఏడుగురిని కొత్తగా తీసుకున్నారు. వీరిలో ఎక్కువమంది యాదవేతర బీసీలు. ఇక్కడ బీజేపీకి ప్రధాన పోటీ దారు అఖిలేశ్ సింగ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాది పార్టీ. ఈ పార్టీ నుంచి నాన్-యాదవ్ బీసీలను దూరం చేయడం ద్వారా యాదవ-ముస్లిం వర్గాలకే సమాజ్‌వాది పార్టీని పరి మితం చేసే లక్ష్యం ఈ వ్యూహంలో కనిపిస్తున్నది. యాదవుల తర్వాత ప్రధాన బీసీ కులమైన కుర్మీ వర్గానికి చెందిన అనుప్రియా పటేల్ (అప్నాదళ్)కు రెండేళ్ల తర్వాత మళ్లీ పదవీయోగం పట్టింది. ఉత్తరాఖండ్‌పై పెద్దగా ఫోకస్ పెట్టలేదు. ఐదు ఎంపీ సీట్లున్న చిన్న రాష్ట్రం అది. ఇక్కడ ఒకసారి కాంగ్రెస్ గెలిస్తే మరోసారి బీజేపీ గెలవడం ఆనవాయితీ. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నది. గుజరాత్ గెలుపు పట్ల బీజేపీలో పెద్దగా అనుమానాల్లేవు. ముఖ్యమంత్రి కంటే ప్రధానమంత్రిని దృష్టిలో పెట్టుకునే జనం ఓట్లేస్తారని ఆ పార్టీ విశ్వాసం. అయినా ఛాన్స్ తీసుకోకుండా రాష్ట్రంలో బలీయమైన సామాజిక వర్గంగా ఉన్న పాటీదార్ల (పటేళ్లు)కు రెండు కేబినెట్ బెర్తులు కేటాయించారు. పంజాబ్‌ను అంతగా పట్టించుకోలేదు. రైతుల ఆందోళన తర్వాత పంజాబ్ మీద బీజేపీ పూర్తిగా ఆశలు వదులుకున్నది. పంజాబ్ నుంచి ఒక్క జాట్ సిక్కుకూ స్థానం దొరకని మొట్టమొదటి కేంద్ర మంత్రిమండలి ఇదే. ఈ రాష్ట్రానికి చెందిన హర్‌దీప్‌సింగ్ పూరీ అనే ఖత్రీ కులానికి చెందిన సిక్కు కేబినెట్‌లో ఉన్నారు. రాష్ట్రంలో జాట్ సిక్కుల జనాభా 30 శాతం దాకా ఉంటుంది. దళితుల జనాభా మరో 30 శాతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కూ, లెఫ్ట్, బీఎస్పీలతో కూడిన అకాలీదళ్ కూటమికీ మధ్యనే ప్రధానంగా పోటీ జరగబోతున్నది. పటియాలా రాజవంశస్థుడైన కెప్టెన్ అమరీందర్‌సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ పరిస్థితి మెరుగ్గానే ఉందన్న అభిప్రాయం ఉన్నది. యువకులు, విద్యావంతుల అనుభూతిని కూడా ప్రభావితం చేసే అంశాలకు కేబినెట్ పొందికలో వీలు కల్పించారు. కేంద్ర మంత్రుల సగటు వయసు 58కి తగ్గింది. రాజకీయ రంగంలో ఇది యూత్ కిందే లెక్క. అట్లాగే మాజీ ఐఏఎస్ అధికారులకు, టెక్నోక్రాట్లకు, డాక్టర్లకు, లాయర్లకు అవకాశం లభించింది. అశ్వినీ కుమార్ వైష్ణవ్ మాజీ ఐఏఎస్ అధికారి. ఆయనకిప్పుడు కేబినెట్ హోదా వచ్చింది. వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ చేశారు. కాన్పూర్ ఐఐటీలో ఎమ్‌టెక్ చేశారు. అక్కడ ఆయన స్పెషలైజేషన్ పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ మీద. ఆయనకిప్పుడు రైల్వే శాఖ లభించడం వెనుక లక్ష్యం సుస్పష్టమే. భారతీయ రైల్వేలు ఇక పీపీపీ పట్టాలెక్కబోతు న్నాయి. మరో ఐఏఎస్ అధికారి రాజ్‌కుమార్‌సింగ్‌కు ప్రమోషన్ లభించి కేబినెట్ మంత్రయ్యారు. బీజేపీ ప్రజా పునాదులను విస్తృతం చేసిన అద్వాణీ రథయాత్ర జరుగుతున్నప్పుడు రాజ్‌కుమార్‌సింగ్ బిహార్ కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్. అప్పుడు ముఖ్య మంత్రిగా ఉన్న లాలూయాదవ్ జిల్లా కలెక్టర్‌కూ, ఎస్పీకి చెప్ప కుండా రాజ్‌కుమార్‌కు అదనపు మేజిస్ట్రేట్ హోదా కల్పిస్తూ ప్రత్యేక ఆదేశాలిచ్చి ఈయన ద్వారానే అద్వాణీని అరెస్ట్ చేయిం చారని చెబుతారు. అద్వాణీని అరెస్ట్ చేసిన అధికారి అదే బీజేపీ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రి కావడం విధివిలాసమేమో! కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికైన రాజీవ్ చంద్రశేఖర్ ఇలినాయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఎమ్‌టెక్ పట్టా పొందారు. ఆయనకిప్పుడు ఐటీ సహాయమంత్రి పదవి లభించింది. బీపీఎల్ టెలికామ్ కంపెనీని ఈయనే స్థాపించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ఈయన పర్యవేక్షించనున్నారు. మంత్రిమండలిలో మహిళల సంఖ్య కూడా 11కు పెరిగింది. అందుబాటులో ఉన్న వివరాల మేరకు ఇప్పటివరకు ఇదే పెద్ద సంఖ్య. మంత్రిమండలి కూర్పులోని సానుకూలాంశాలను ప్రచారం చేసుకోవడం ద్వారా లబ్ధిపొందాలని పార్టీ నేతలు భావిస్తున్నారు.

## వాయువ్య బంగాళా ఖాతంలో అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 55-65 కీ.మీ వెగంతో గాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందన్నారు. మత్స్యకారులు మంగళవారం వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కన్నబాబు సూచించారు.

### రాయలసీమ ఎత్తిపోతల వల్ల

## ప్రకాశం జిల్లాకు తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

డోల బాల వీరాంజినేయులు స్వామి, ఏలూరి సాంబశివరావు సీఎం రాసిన లేఖలో కోరారు. పంట భూములు, భూగర్భజలాలకు సాగర్ నీరే ఆధారమని లేఖలో పేర్కొన్నారు. 15 ఏళ్లలో మూడు సంవత్సరాలు మాత్రమే సాధారణ వర్షపాతం వస్తే.. ప్రకాశం జిల్లాలో మిగిలిన పన్నెండేళ్లు కరవే తాండవం చేసిందన్నారు.

**సీఎం జగన్‌కు తెదేపా ఎమ్మెల్యేలల లేఖ**

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మరింత చేటు చేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం నిండి నాగార్జున సాగర్‌కు నీళ్లు వస్తేనే ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలు పారుతాయని గుర్తు చేశారు. శ్రీశైలం నిండకుండా మీరు వాళ్ల ప్రాజెక్టులు కట్టుకుంటే ప్రకాశం జిల్లా పరిస్థితి ఏంటని లేఖలో ప్రశ్నించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంతో కరవు జిల్లా పరిస్థితి ఏంటని నిలదీశారు. రాయలసీమ ఎత్తిపోతల 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కుల పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. గుంటూరు ఛానల్‌ను దగ్గుబాడు వరకు పొడిగించి ప్రజల దాహార్తిని తీర్చే, పంటలకు సాగునీరు ఇవ్వాలని కోరారు.

## విచక్షణ కోల్పోతున్న అధికారులు..

(మొదటి పేజీ తరువాయి)

మియాగంజ్‌లో చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీవో) గా విధులు నిర్వహిస్తున్న దివ్యాన్షు పటేల్ జర్నలిస్టుపై దాడికి పాల్పడ్డారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జర్నలిస్టు సెల్‌ఫోన్‌తో అక్కడ నెలకొన్న పరిస్థితులను షూట్ చేస్తుండగా.. దివ్యాన్షు పటేల్ రెచ్చిపోయారు. వెంటపడి మరి జర్నలిస్టుపై దాడి చేశారు. కాగా.. బాధిత జర్నలిస్టు.. దివ్యాన్షు పటేల్ పై పలు ఆరోపణలు చేశాడు. ఓటింగ్‌లో పాల్గొనకుండా లోకల్ కౌన్సిల్ సభ్యులను కొందరిని కిడ్నాప్ చేశారని.. దీనిని ప్రశ్నించడంతో.. ఆయన దాడి చేశారని ఆరోపించారు. కాగా.. దీనిపై ఐఏఎస్ అధికారి దివ్యాన్షు స్పందిచలేదు. ఇదిలాఉంటే.. ఈ ఘటనపై ఉన్నావో జిల్లా మేజిస్ట్రేట్ రవీంద్ర కుమార్ స్పందించారు. అక్కడున్న జర్నలిస్టులతో.. ఈ ఘటనపై మాట్లాడామన్నారు. దాడికి గురైన జర్నలిస్ట్ నుంచి లిఖితపూర్వక ఫిర్యాదు వచ్చిందని.. విచారణ అనంతరం న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.

## జోరువానలో ఎమ్మెల్యే నిమ్మల సైకిల్ యాత్ర



ఏలూరు: పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు జోరు వానలోనూ సైకిల్ యాత్రను కొనసాగించారు. కొవిడ్ బాధిత కుటుంబాలను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే సైకిల్ యాత్ర చేపట్టారు. యలమంచిలి మండలం కలగంపూడీ గ్రామానికి 15 కిలోమీటర్లు సైకిల్‌పై గొడుగు వేసుకుని ఎమ్మెల్యే పర్యటించారు. కొవిడ్ బాధిత కుటుంబాలను పరామర్శించి పౌష్టికహారం, నిత్యావసర సరుకులను అందజేశారు.

# వీక్షకులకు కనువిందు చేస్తున్న పైలాన్..

# రాత్రిపూట సందడిగా మారనున్న గాంధీ సెంటర్

## మొండితోక బ్రదర్స్ అభివృద్ధికి ఇదో మచ్చుతునక



నందిగామజులై11ప్రజాపాలన:హైదరాబాద్ కు చా ర్మినార్. బెజవాడకు ప్రకాశం బ్యారేజి విశాఖకు ఆర్కే బీచ్. కర్నూలు కొండారెడ్డి బురుజు లాంటివి ఆయా న గరాలకు అలా కనువిందు చేస్తున్నాయి.అదేవిధంగా నందిగామ నియోజకవర్గం లోని నందిగామ నడిబొ డ్డున ఉన్నటువంటి గాంధీ సెంటర్లో నవరత్నాల పైలా న్ సాగర్ డ్యాం నమూనాలో రాత్రిపూట విద్యుత్ కాం తులతో వీనులవిందు చేస్తుంది.సాధారణంగా సా యంత్రం పూట ప్రతి ఒక్కరూ తమ పనులు ముగిం చుకొని ఒక్కసారైనా గాంధీ సెంటర్ కు వచ్చి వెళ్లటం నందిగామ ప్రజలకు ఆనవాయితీగా ఉండేది కానీ ప్ర స్తుతం ఈ సాగర్ డ్యామ్ నమూనా విద్యుత్ కాంతుల తో జిగేల్ జిగేల్ మంటుంటే ప్రజలంతా ఆసక్తిగా తిల కిస్తున్నారు పట్టణ నడిబొడ్డున ఇలా ఏర్పాటు చేయ డం వల్ల సాయంత్రం పూట వీక్షకులకు ఆహ్లాదకరంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన చ ట్టాల ప్రకారం ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసిం చాలనే నినాదాన్ని ఆచరించి ఉన్నత చదువులు అ భ్యసించి వైద్య వృత్తిలో అపారమైన అనుభవం గడిం చి శాసనసభ్యుడిగా ఎన్నికైన డాక్టర్ మొండితోక జగ న్మోహనరావు నందిగామ నియోజకవర్గం ను అభివృ ద్ధి పథంలో తీసుకు వెళ్ళటానికి అనేక రూపకల్పన చేస్తున్నారు.అందులో భాగంగానే ఆయన సోదరుడు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ తన ఆలోచనా విధానంతో నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలనే అన్న ఆదేశాల మేరకు నడి బొడ్డున ఏ ర్పాటు చేశారు.ఇవే కాక నందిగామ నియోజకవ ర్గం లో కృష్ణా నది పరివాహక ప్రాంతం అధికంగా ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతాలలో కూడా పర్యాటక ప్రాం తాలుగా చేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం.ఏ ది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో అభివృద్ధికి చిరు నామా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో పాటు రానున్న రోజుల్లో పర్యాటక కేంద్రాల పై కూడా దృష్టిసారించి నందిగామ అంటే పర్యాటక కేంద్రంగా రానున్న రోజు ల్లో సమాజానికి ఒక అభిప్రాయం తీసుకురావటం కో సం అన్నదమ్ములు శక్తివంచన లేకుండా కృషి చే స్తు న్నారనటంలో ఎటువంటి సందేహం లేదు.

## ఆనందయ్య మందు పంపిణీ



జగ్గయ్యపేట 12 జులై(ప్రజాపాలన)జగ్గయ్యపేట పట్ట ణం శ్రీరాం అమ్మాని కాలేజీ నందు వాసవి కపుల్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో దాతలు చింత వెంకటశేషానందం, పేరూరి నరసింహారావు సహకారంతో నెల్లూరి ఆనం దయ్య ఆయుర్వేద మందు ను టిడిపి జాతీయ కో శాధికారి %ు% మాజీ ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తా తయ్య) మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ శ్రీరాం సుబ్బా రా వు చేతుల మీదుగా సుమారు 600 మంది ప్రజలకు మందును అందజేశారు ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ మందుతో పాటు ఒక కరపత్రాన్ని ఇ చ్చారు ఇందులో ఉన్న సూచనలను పాటిస్తూ వాడా లని అదేవిధంగా ఈ మందు వాడుతున్నప్పటికీ కూ డా వైద్యుల సలహా ప్రకారం మాస్కు ధరించి సామా జిక దూరాన్ని పాటిస్తూ అందరూ తగు జాగ్రత్తలు తీ సుకోవాలని సూచించారు అదేవిధంగా డబ్ల్యూహెచ్ఓ కూడా థర్డ్ వేవ్ ఉందని అంటున్నారు అందువలన ప్ర తి ఒక్కరు కూడా జాగ్రత్తలు పాటిస్తూ వైద్యుల సలహా ప్రకారం అందరూ కూడా ముందుకు పోవాలని అంద రూ సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నాను అని తాతయ్య అన్నారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వాసవి క్లబ్ వారందరిని తాతయ్య ప్రత్యేకంగా అభినందించారు,ఈకార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, వాస వి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకరపర్తి సోమేశ్వర రావు, అధ్యక్షులు కొత్త కృష్ణారావు, కార్యదర్శి కాకర పర్తి జనార్ధన్ రావు, వాసవి క్లబ్ నందనవనం అధ్య క్షులు రాయపూడి శ్రీకాంత్, కొప్పు సత్యనారాయణ, లక్ష్మీ, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు గెల్ల రాము, పబ్బి శెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సదస్సు



ఏలూరు, జులై, 11, ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు మండలం మాదేపల్లి గ్రామం యాదవుల కమిటీ హాల్ లో బీసీ సదస్సు జరిగింది ఈ సదస్సులో రంగారావు గారు చింతపల్లి బాలకృష్ణ గారు చింతపల్లి డాక్టర్ రవిచంద్ర గారు సుబ్రహ్మణ్యం గారు మాజీ సర్పంచ్ తాడిశెట్టి రమణ గారు రాజశేఖర్ కనకరాజు నాగు రామకృష్ణ గారు సత్యనారాయణ గారు బీసీ నాయకులు శ్రీనివాస్ గారు మొదలగు బిసి నాయకులు పాల్గొన్నారు విషయం అం జరిగిన కాలంలో మాదేపల్లి వైసిపి నాయకులు బి సి కమిటీ నాయకులు ని డి కొండ లక్ష్మి పండు అకాల మరణం కి చింతిస్తూ వారికి శ్రద్ధాంజలి కట్టించారు ఈ కార్యక్రమంలో లో మాదేపల్లి అన్ని కమ్యూనిట్ బీసీ నాయకులు కరోనా నిబంధనలు పాటిస్తూ సంతాప సభ నిర్వహించారు.

## పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన మమ్మల్ని అడ్డుకోవడం దారుణం:ప్రభుత్వ విప్ సామినేని ఉద యభాను



జగ్గయ్యపేటజూలై11ప్రజాపాలన:పులిచింతల ప్రాజె క్టు వద్ద తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా విద్యుదుత్ప త్తి చేస్తోందని ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్లిన మమ్మల్ని అ డ్డుకోవడం దారుణమని రాష్ట్ర ప్రభుత్వ విప్,జగ్గయ్య పేట శాసనసభ్యులు సామినేని ఉదయభానుఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును తెలంగాణ సరిహద్దు వద్ద తెలంగాణ రాష్ట్ర పోలీసులు అడ్డుకున్నారు. అడ్డుకున్న ప్రదేశం లోనే తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదా లు చేశారు. అనంతరం ముక్త్యాల గ్రామం నుండి గుం టూరు జిల్లా మాదిపాడు గ్రామానికి కృష్ణానది మీదగా పడవ పై ప్రయాణించి పులిచింతల ప్రాజెక్టుకు చేరుకు న్నారు. అక్కడ కూడా తెలంగాణ పోలీసులు డ్యామ్ మీదకు రావడానికి అనుమతులు లేవని మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలవకుండా తెలంగా ణ ప్రభుత్వం అక్రమ విద్యుదుత్పత్తి వల్ల నీరు వృథా అవుతోందన్నారు. విభజన హామీలను తెలంగాణ తుంగలో తొక్కుతోందని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులలో తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, ప్రా జెక్టు సందర్శించడానికి వచ్చిన మమ్మల్ని తెలంగాణ పోలీసులు అడ్డుకోవడం దారుణమని ధ్వజమెత్తారు. అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి ఇదేవిధంగా కొనసాగిస్తే సహించేది లేదని, తెలంగాణ మంత్రులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన ప్రకా రం తెలంగాణ ప్రభుత్వంనీటినివాడుకోవాలనన్నారు.

## పౌరోహిత్యాన్ని కుల వృత్తి గాగుర్తించాలి- ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ మల్లాది విష్ణు ని ఆంధ్రప్రభ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిసిన ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు ,పౌరోహిత్యాన్ని కుల వృత్తిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని తమ సమస్యలను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లాలని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కి వినతిపత్రం అందజేశారు .కులవృత్తిగా గుర్తించడం ద్వారా తమకు భద్రత, భరోసా లభిస్తుందని అన్ని సంక్షేమ పథకాలకి అర్హులు అవుతామని సమాఖ్య సభ్యులు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని చెప్పటంతో ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు హర్షం వ్యక్తం చేశారు .

## మచిలీపట్నం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం




మచిలీపట్నం (ప్రజాపాలన) : మచిలీపట్నం రోటరీ క్లబ్బు లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా డా. పి.డి.జి. మోహన్ ప్రసాద్ గారు విచ్చేశి ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మోహన ప్రసాద్ ఆయన మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన మచిలీపట్నం క్లబ్ పూర్వ వైభవం సబ్యత్వ సేకరణ ద్వారా సాధ్యమవుతుందని అందుకు అందరూ సహకరించి కష్టపడి లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. రోటరీ క్లబ్బు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు నిత్యం ప్రజలకు ఉపయోగ పడుతున్నప్పటికీ ఆశించిన మేర రోటరీ కార్యక్రమ లక్ష్యాలు మరింతమందికి చేరువ కావడం లేదని అందుకు అవగాహన సదస్సులద్వారా ప్రజలు చేరువ కావాలని సబ్యులకు గుర్తు చేశారు. అనంతరం క్లబ్ ప్రెసిడెంట్ జ్యోతి మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ గవర్నర్ గారి దిశ నిర్దేశం మేరకు క్లబ్ కార్యక్రమాలు జరిపిస్తామని, పెద్దల సూచనలు సలహాలను పాటిస్తూ కమిటీలను ఏర్పాటు చేసి రోటరీ క్లబ్బు చేపట్టే నూతన ప్రాజెక్ట్ ల వివరాలను ప్రజలకు చేరువయ్యే విధముగా లక్ష్యాలను నిర్ణయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరాక్ట్ సంజయ్ పేరున 5 లక్షల రూపాయలను ఇన్సూరెన్స్ చేయించి రసీదును పి.డి.జి. మోహన్ ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. ఆదరణ కోల్పోయి ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న వరలక్ష్మి అనే పేదమహిళకు నెలకు 2000 రూపాయలు మందుల కొరకు క్లబ్ ప్రెసిడెంట్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. పట్టణంలో వైద్య ఖర్చుల కొరకు ఇబ్బందులు పడుతున్న షకీరబేగంకు రోటరీ క్లబ్ తరుపున వైద్యము కొరకు విరాళాలు సేకరించి వైద్యం చేస్తున్నామని సబాముకమగా తెలియజేయడంతో స్పందించిన కె. అనిల్ కుమార్ 10000 రూపాయలు వైద్యం ఖర్చుల నిమిత్తం అందజేసి తన దాతృత్వం చాటుకున్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్ధులకు నోట్ పుస్తకాలు, ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు, కాలిక్యులేటర్లు మరియు తదితర పరికరాలను పేద పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమం విజయానికి కారకులయిన పి. మెహర్ కుమార్, సాయిప్రసాద్, కె. శ్రీనివాసరావు, పరుచూరి బాబు, అచ్చుతరామయ్య, అజ్మతున్నిసా బేగం, సెక్రెటరీ అనుపమ ముఖర్జీ, పి. వెంకటేశ్వర్లు, కె. అనీల్ కుమార్, పద్మావతి, మాజీ ప్రెసిడెంట్ కర్రెడ్ల సుశీల లను అభినందించారు.

# జగ్గయ్యపేట మండలంలోని

# విశాఖ స్టీల్ ప్లాంట్ కూడా ప్రైవేట్ పరం కాబోతుందా!

జగ్గయ్యపేట 12 జులై (ప్రజాపాలన)కార్మికులు,భూములిచ్చిన రైతుల పరిస్థితి ఏమిటి.స్థానిక నాయకుల మాట ఏమిటి.. వ్యాపార వేత్తలు, ప్రజలు ఏమి అను కుంటున్నారు,రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ ఉక్కు ఆంధ్రు ల హక్కు అని నినదించి విశాఖ స్టీల్ ప్లాంట్ కర్మాగా రాని సాదించుకున్న విషయం అందరికి తెలిసినదే ,దీ నిలో భాగంగా అప్పటి రైతులు ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం వేల ఎకరాల భూ మిని ప్రభుత్వానికి అప్పగించి ఉమ్మడి రాష్ట్రంలో వై జాక్ లో మరియు ఇతర ప్రాంతాల్లో సుమారు ఐదు కర్మాగారాలు వైజాక్ కి అనుబంధంగా ఏర్పడిన్నాయి ,దీనిలో భాగమే జగ్గయ్యపేట మండల ప్రాంతంలో కె అగ్రహారం గ్రామంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కో సం కొంతమంది రైతులు సుమారు పదిహేను వేల హె క్టార్ల భూమిని ఇవ్వడంతో 1989 సంవత్సరంలో ప్లాం ట్ ని ఏర్పాటు చేయడం జరిగింది,దీనితో ఉద్యోగస్థ లు మరియు స్థానిక కార్మికులకు ఉపాధి దొరకడంతో ,దీని మూలానా జగ్గయ్యపేట ప్రాంతంలో వ్యాపార అ భివృద్ధి చెంది,రాష్ట్రంలో జగ్గయ్యపేట ప్రాంతం కూడా గుర్తింపు పొందిందనే చెప్పుకోవచ్చు,దీనితో జగ్గయ్య పేట ప్రాంతం మరింత కర్మాగారాలకు అనుకూలమైన ప్రాంతంగా మారడంతో ఈ ప్రాంతంలో ప్రైవేట్ సిమెం ట్ కర్మాగారాల ఏర్పాటు కూడా చెక చెక కొనసాగిం ద నే చెప్పుకోవచ్చు,విశాఖ స్టీల్ ప్లాంట్ కేంద్ర ప్రభుత్వం సంస్థ అవడంతో రైల్వే లైన్ ఏర్పాటు తో ముడి వస్తు వు రవాణా కావడంతో సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ కి భా రీగా ఆదాయం వనరులు రావడంతో దేశంలో రైల్వే కి ప్రధానఆదాయవనరులుగాఈ ప్రాంతంమారింది,భారత దేశంలో సంస్కరణలు రావడం,ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో క్రమేపి ఆదాయం వస్తున్న ప్ర భుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చే యడంతో విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఉత్పత్తి సామర్థ్యం ప్రకారం కొత్త గా మైనింగ్ ను అప్పగించకపోవడంతో క్రమేపి ఉ త్పత్తిని తగ్గిన్నా ఖర్చులు పెరుగుతున్నా యనే ముసుగులో విశాఖను బిజెపి పాలిత కేంద్ర ప్ర భుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ లను అమ్మే ప్రయత్నాలకి శ్రీకారం చుట్టింది,రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ ఉ క్కును ప్రైవేట్ పరం కాకుండా కా పాడు కోవడం కోసం సంఘాలు,ఉద్యోగ,కార్మికులు వైజాక్ లో సుమారు 150 రోజల నుండి అన్ని పార్టీ లను,సంఘాలను,ప్రజలను కలుపుకొని ఆందోళన చే స్తున్న విషయం తెలిసినదే,కాని కేంద్ర ప్రభుత్వం విశా ఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేట్ సంస్థలకు ఎంతకైన అమ్మి సొమ్ము చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసిన ట్లు కనబడుతుంది,జగ్గయ్యపేట ప్రాంతంలో గల వి శాఖ ఉక్కు కర్మాగారంలో 150 మంది కార్మికులు ప నిచేస్తుండగా దీనిలో సగం మంది స్థానికులు పనిచే స్తున్నారు,జగ్గయ్యపేట ప్రాంతంలో గల విశాఖ స్టీల్ లో కొంత భాగాన్ని గతంలో ఒక్క ప్రైవేట్ సిమెంట్ కర్మాగారానికి నాయకుల ప్రోబల్యంతో అప్పగించిన ట్లుగా,మరలా అదే ప్రైవేట్ సిమెంట్ కంపెనీనే దీనిని దక్కించుకునే ప్రయత్నాలను చేస్తున్నట్లుగా పుకార్లు వినిపిస్తున్నాయి,ఇప్పటికే ఈ ప్రాంతం నుండి సుమా రు నెలకి సుమారు 56వేల మెట్రిక్ టన్నులు మైనింగ్ ని వెలికి తీస్తూ,సుమారు కోటిన్నర రూపాయల ఆదా యాన్ని ప్రభుత్వానికి చేకూరుస్తుంది,ఈ ప్రాంతానికి విచేసి ప్లాంట్ ని కేంద్ర మంత్రి పరిశీలించిన తర్వాత జగ్గయ్యపేట విశాఖ స్టీల్ ప్లాంట్ ని కూడా కేంద్ర ప్రభు త్వం అమ్మకానికి పెట్టినట్లుగా సమాచారం,రాష్ట్రంలో వైజాక్ లో స్టీల్ ప్లాంట్ కోసం ఉవ్వెత్తున ఆందోళనలు జరుగుతుంటే,




జగ్గయ్యపేట ప్రాంతంలో గల స్టీల్ ప్లాం ట్ ని కాపాడుకునే ప్రయత్నాలు తక్కువగానే ఉన్నా యని చెప్పవచ్చు,జగ్గయ్యపేట ప్రాంతంలో నాయ కు లకు వివిధ ప్రైవేట్ కర్మాగారాలలో ఆర్థిక లావాదేవీ లు,సత్సంబంధాల ఉ ండటం మూలానానేమో గాని,వి శాఖ స్టీల్ ప్రైవేటీకరణన పై చెప్పుకునంత మేర గళం విపడంలేదని,విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం అయి తే ఇంకా లాభ పడవచ్చునేమోనని గోడ మీద పిల్లి మాదిరిగా నాయకుల తీరునట్లుగా ప్రజలు గుసగు సలాడుతున్నారు,ఉ ద్యోగ,కార్మికులు మాత్రం మా పొ ట్టకొట్టొద్దని ప్రభుత్వాని చేతులు జోడించి వేడుకుం టుంటే,భూమిలిచ్చిన రైతులు మాత్రం ప్రైవేట్ కంపె నీలకి అప్పగిస్తే మాత్రం తిరిగి వారి భూమిని వారికి ఇచ్చేయాలని,లేనియెడల ప్రభుత్వం పై ఉద్యమిస్తా మని వారు భావిస్తున్నట్లుగా సమాచారం, వ్యాపార వర్గాలు,సామాజిక నాయకులు,ప్రజలు మాత్రం ఇప్ప టికే ప్రైవేట్ రంగ సంస్థలకి కర్మాగారాల అనుమతులి వ్వడంతో వారి ధన దాహంతో జగ్గయ్యపేట ప్రాంతం కాలుష్య మయంగా మారి ప్రజల ఆయు ప్రమాణాలు తగ్గిపోతున్నాయని,విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేట్ సం స్థలకు అప్పగిస్తే చావే శరణ్యమని,ఈ పాపం ప్రభు త్వానిదేనని భావిస్తున్నారు,ఏది ఏమైనా విశాఖఉక్కు ఆంధ్రుల హక్కేనని,ప్రైవేట్ రంగానికి అప్పగిస్తే చూ స్తూ ఉండబోమని ప్రజల నుండి వినిపిస్తున్న మా ట లు.మరి ఏమి జరుగుతుందో చూడాలి.

